# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ముంబయి ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పరామర్శించారు.

- బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని మంత్రి ఎస్. సవిత తెలిపారు.

- అమృత్ భారత్ పథకం కింద దేశంలోని రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాధ్ తెలియజేశారు.

- ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================

ముంబయి కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో కుడి భుజానికి ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు పరామర్శించారు. ముఖ్యమంత్రి ఈరోజు ముంబయి ఆసుపత్రికి వెళ్ళి పవన్ కళ్యాణ్‌తో మాట్లాడి, ఆయన ఆరోగ్య పరిస్థితిని, ఆపరేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రొటేటర్ కఫ్ గాయంతో పాటు భుజానికి అవల్షన్ ఫ్రాక్చర్ ఉండటంతో కుడి భుజానికి శస్త్రచికిత్స చేశామని, కొన్ని రోజుల తర్వాత ఎడమ భుజానికీ శస్త్రచికిత్స జరగనుందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

=====================

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవిత ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండల కేంద్రంలో ఈరోజు పర్యటించారు. ఎంజేపీ గురుకుల పాఠశాలలో 75 లక్షల రూపాయలతో పీ-4 విధానంలో నిర్మించిన డైనింగ్ హాల్, డార్మెటరీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యా శాఖ మంత్రిగా నారా లోకేశ్ చేపట్టిన సంస్కరణల ఫలితంగా టెన్త్, ఇంటర్ లో గతంలో ఎన్నడూ లేనివిధంగా మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 109 గురుకులాలు ఉన్నాయని, ఈ ఏడాది కొత్తగా మరో 10 గురుకులాలను స్థాపిస్తున్నామని, 6 ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. ఎంజేపీ స్కూళ్లు, బీసీ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్న మంత్రి.. ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాలు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేశామని, సన్నబియ్యంతో రుచికరమైన భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు.

=====================

రాయనపాడు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల భౌతిక, ఆర్థిక పురోగతి 100 శాతం పూర్తయిందని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాధ్ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యాలు, భద్రత, ఆధునిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ పలు కీలక పనులు పూర్తి చేశారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 35 కోట్ల రూపాయలకు పైగా నిధులతో అభివృద్ధి పనులు జరిగాయని, కొండపల్లి బొమ్మల పెయింటింగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. విజయవాడ ప్రధాన స్టేషన్‌లో రద్దీని తగ్గించడానికి ప్రత్యామ్నాయ శాటిలైట్ టెర్మినల్ గా రాయనపాడు స్టేషన్ అత్యాధునిక హైటెక్ హంగులతో ఈ నెల 17వ తేదీన ప్రారంభానికి సిద్ధమైందని చెప్పారు. అమృత్ భారత్ పథకం

కింద దేశంలోని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని ఎంపీ కేశినేని తెలియజేశారు.

=====================

నిన్న తుది శ్వాస విడిచిన ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాళులు అర్పించారు. ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఈరోజు ఆయన జానకి చిత్రపటానికి పూలమాల వేసి, భారతీయ సంగీత రంగానికి ఆమె అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. తెలుగు నేలపై జన్మించిన జానకమ్మ 6 దశాబ్దాలకు పైగా తన అపూర్వ గానంతో కోట్లాది సంగీతాభిమానుల హృదయాలను గెలుచుకున్నారని ముఖ్యమంత్రి అన్నారు. ఆమె పాటలు అందరి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతాయంటూ.. జానకమ్మ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

=====================

స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో జరుగుతున్న ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ - 4లో భారత మహిళల కాంపౌండ్ జట్టు రజిత పతకాన్ని కైవసం చేసుకుంది. వెన్నం జ్యోతి సురేఖ, పృథికా ప్రదీప్, చికితా తనిపర్తి అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.. భారత మహిళల ఆర్చరీ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ వేదికపై భారత కీర్తి పతాకాన్ని ఎగురవేసిన క్రీడాకారిణులు అందరికీ స్ఫూర్తిదాయకమని ఆయన వ్యాఖ్యానించారు. దేశానికి మరిన్ని అంతర్జాతీయ స్థాయి పతకాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

=====================

విరామం

=====================

నీతి ఆయోగ్ అమలు చేస్తున్న ఆకాంక్ష జిల్లాల కార్యక్రమం జిల్లా ర్యాంకింగ్స్‌లో బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో అల్లూరి సీతారామరాజు జిల్లా దేశంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని మరో విశిష్ట విజయం సాధించిందని కలెక్టర్ టి. నిశాంతి తెలిపారు. మరుమూల గిరిజన ప్రాంతాల్లో సైతం మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, రహదారులు, విద్యుత్, తాగునీరు, విద్య, వైద్యం వంటి ప్రాథమిక సేవలను ప్రజలకు చేరువ చేయడంలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం, శాఖల మధ్య సమన్వయంతో పనిచేయడం, క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావం, నిరంతర పర్యవేక్షణ ఈ ఘన విజయానికి ప్రధాన కారణాలని తెలిపారు. ఈ విజయం.. జిల్లా యంత్రాంగం సమిష్టి కృషికి నిదర్శనమని, ప్రజా ప్రతినిధులు, అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, ప్రజల సహకారంతోనే ఈ ఘనత సాధ్యమైందని కలెక్టర్ నిశాంతి వివరించారు.

=====================

విజయవాడ వడ్డేశ్వరంలో రేపు సంస్కృత మేధావులతో సదస్సు నిర్వహించనున్నామని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమి అధ్యక్షులు ఆర్. డి. విల్సన్ శరత్ చంద్ర తెలిపారు. ఈ సదస్సు ద్వారా సంస్కృత భాష విస్తరణకు తీసుకోవలసిన కార్యాచరణపై మేధావులతో చర్చించడం జరుగుతుందని చెప్పారు. సంస్కృత భాషను సామాన్యులలోకి తీసుకుని వెళ్లడం లక్ష్యంగా అకాడమీ ప్రస్థానం సాగుతుందన్నారు. అందరికీ సంస్కృతం.. అందరిలోకీ సంస్కృతం అనే నినాదంతో సంస్కృత భాష విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. సంస్కృత భాష వ్యాప్తి కోసం అకాడమీ.. పఠిత సంస్కృతం పేరుతో పుస్తకాలు ముద్రించిందని, ఆ పరంపర కొనసాగుతుందని విల్సన్ శరత్ చంద్ర వివరించారు.

=====================

ఆంధ్రప్రదేశ్, యానాం లలో దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ, వాయువ్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ తెలిపారు. బలమైన గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని పేర్కొంటూ...

(వాయిస్…26 సెకన్లు)

=====================

జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఈరోజు ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 13 లక్షల 40 వేల 126 మంది ఓటర్లలో 11 లక్షల 39 వేల 840 మంది వివరాలు డిజిటలైజ్ చేశామని, అలాగే.. క్షేత్రస్థాయి ధృవీకరణతో కలిపి 91 శాతం పురోగతి సాధించామని చెప్పారు. మరణించినవారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, ఇతర నియోజకవర్గాల్లో నమోదైనవారు, చిరునామాలో అందుబాటులో లేని వారి వివరాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని కలెక్టర్ తెలిపారు.

=====================

=====================